# సాక్షి పెద్దపల్లి

గురువారం । 21 । డిసెంబర్ । 2023






## మహిళలకు ఆటల పోటీలు

రామగిరి: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఈఆర్ క్లబ్‌లో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు.



## అలరించిన దీపాలంకరణ

గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావాన్ని పురస్కరించుకుని జీఎం కాలనీ గ్రౌండ్‌లో ముగ్గులు, దీపాలంకరణ పోటీలు నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/24.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### మంత్రిని కలిసిన మిమిక్రీ ఆర్టిస్ట్



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శివారెడ్డి

రామగుండం: రోడ్లు, భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని పట్టణానికి చెందిన సినీ, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురైన మంత్రిని శివారెడ్డి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.

### అక్రమ కట్టడాల కూల్చివేత



మార్కెట్‌లో నిర్మించిన షెడ్డు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అనుమతి లేకుండా నిర్మించిన కట్టడాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కూల్చివేశారు. 31వ డివిజన్ మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లో అనుమతి లేకుండా నిర్మించిన షెడ్డు తొలగించారు. అలాగే 37వ డివిజన్ అడ్డగుంటపల్లి చెరువు స్థలంలో కాలువ పూడ్చి చేపట్టిన పనులను కూడా నిలిపివేయించారు.

### రామగుండం చేరిన అయోధ్య రాముడి అక్షింతలు



అక్షింతలతో ప్రముఖుల ఊరేగింపు

రామగుండం: అయోధ్య రాముడి పాదాల చెంత పూజించిన అక్షింతలు బుధవారం ప్రత్యేక వాహనంలో పట్టణానికి తీసుకొచ్చారు. శ్రీవారి కోలాట బృందం స్వాగతం పలికారు. అంబేడ్కర్ కూడలి నుంచి శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం వరకు ప్రముఖులు అక్షింతలు తలపై పెట్టుకొని ఊరేగింపుగా చేరుకున్నారు. ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖర్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనవరి ఒకటి నుంచి 14వ తేదీలోగా ప్రతీ భక్తుడికి ఈ అక్షింతలు పంపించనున్నట్లు పూజారి తెలిపారు. కార్పొరేటర్ కౌశిక లత, కాంగ్రెస్ నాయకులు అయోధ్యసింగ్ ఠాకూర్, బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి, మాజీ కౌన్సిలర్ ఇసంపెల్లి అంజులు, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కోలహాలం శ్రీనివాస్‌రావు, తాటిపెల్లి శివప్రసాద్, లగిశెట్టి రవి, గురుస్వామి గోపగాని రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### మల్లన్నస్వామికి బోనాలు



దేవస్థానంలో భక్తుల బోనాలు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో భక్తులు బుధవారం పట్నాలు వేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కోనేటిలో స్నానాలను ఆచరించి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు తయారు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### పత్తి ధర రూ.6,582

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం పత్తి క్వింటాలు ధర గరిష్ఠంగా రూ.6,582 పలికింది. కనిష్ఠంగా రూ.5,924, సరాసరి ధర రూ.6,492గా నిర్ణయించినట్లు ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు. జిల్లాలోని 175మంది రైతులు తెచ్చిన 806 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# సైబర్ వల.. విలవిల

జిల్లా కేంద్రానికి చెందిన దంపతులకు ఓ బ్యాంకులో వేర్వేరుగా సేవింగ్ అకౌంట్లు ఉన్నాయి. గత నాలుగు రోజుల్లో భర్త ఖాతా నుంచి రూ.30వేలు, భార్య ఖాతా నుంచి రూ.45వేలు మాయమయ్యాయి. మరో వ్యక్తి అకౌంట్ నుంచి రూ.4,500 కనిపించకుండా పోయాయి. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. గోదావరిఖని యైటింక్లయిన్‌కాలనీలో నివాసంఉండే రిటైర్డ్ సింగరేణి కార్మికుడి ఖాతా నుంచి రూ.10వేలు మాయం కాగా సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు. అయినా, మరుసటిరోజు మరో రూ.10వేలు కనిపించకుండా పోయాయి.



- నెట్టింట దోచేస్తున్న మోసగాళ్లు
- సరికొత్త పంథాలో నేరాలు
- లక్కీడ్రా, ఉద్యోగాలు, తక్కువ ధర అంటూ ఆఫర్లు
- సైట్‌పై క్లిక్ చేయగానే మాయమవుతున్న నగదు
- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు

సైబర్ నేరాల వివరాలు

| వివరాలు | 2022 | 2023 |
|---|---|---|
| ఫిర్యాదులు | 1,471 | 1,734 |
| నమోదైన కేసులు | 120 | 254 |
| కోల్పోయిన నగదు | 5,61,21,032 | 3,23,62,528 |
| రికవరీ చేసిన నగదు | 50,78,103 | 21,97,337 |

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో సైబర్ నేరగాళ్లు రోజుకో రూపంలో వల విసురుతున్నారు. పురాణాల్లో రాక్షసులు పలు రూపాల్లో ప్రజలను వేధించేవారని చెబుతుంటారు. ఇప్పుడు సైబర్ నేరగాళ్లలోనూ ఇదే ధోరణి కనిపించడం గమనార్హం. ప్రజలకు ఒక దానిపై అవగహన వచ్చేలోపే మరోకొత్త మోసానికి పాల్పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఇటీవల వెలుగుచూసిన సైబర్ మోసాలు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి.

**ఆధునిక మొబైళ్లు.. ఇంటర్నెట్ సౌకర్యం..**

- ప్రస్తుతం ప్రతీ పదిమందిల్లో ఎనిమిది మంది ఇంటర్నెట్‌తో కూడిన ఆధునిక మొబైళ్లు వినియోగిస్తున్నారని అంచనా.
- ఒక కుటుంబంలో ఐదుగురు సభ్యులు ఉంటే అందులో నలుగురు నెట్‌సౌకర్యం కలిగిన ఫోన్లు వాడుతున్నారు.
- వీరు తమకు అవసరమై వస్తు సామగ్రి కొనుగోలు చేయడం, నచ్చిన సినిమాలు చూడటం, ఇతర పనులు చక్కబెట్టుకునే క్రమంలో సైబర్‌నేరగాళ్లకు చిక్కుతున్నారు.
- దీంతో సైబర్ నేరగాళ్ల అన్ని వయస్సుల వారినీ నెట్టింటోల్లో దోచేస్తున్నారు.
- అంతేకాదు.. న్యూడ్ వీడియోకాల్స్‌తో బెదిరింపులు, బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని ఓటీపీ అడగడం, లక్కీడ్రాలో బహుమతి గెలిచారని, క్రెడిట్‌కార్డు ఇస్తామని, ఇంటిద్దే ఆన్‌లైన్‌లో డబ్బులు సంపాదించవచ్చని మా కంపెనీల్లో మంచి ఉద్యోగం ఇస్తామని, మ్యాట్రిమోనీ, డేటింగ్‌యాప్, కొద్దిపెట్టుబడితో భారీ లాభాలు, ఆన్‌లైన్ గేమింగ్, లోన్‌యాప్స్.. ఇలా రకరకాలతో ఆన్‌లైన్ మోసాలకు తెరలేపుతున్నారు.
- ఆ తర్వాత బ్యాంకు ఖాతాలోంచి సొమ్ము దోచేస్తున్నారు.

**బాధితుల్లో విద్యావంతులే అధికం..**

గతేడాది జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాల కేసులు 120 నమోదుకాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 254 చోటు చేసుకున్నాయి. గతేడాదితో పోల్చితే వాటి సంఖ్య పెరిగింది. మోసపోయే వారిలో అత్యధికులు విద్యావంతులే కావడం గమనార్హం. ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం.. సైబర్ నేరాలు జరిగే రాష్ట్రాల్లో మన రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. బాధితుల్లో సుమారు 70శాతం మంది ఉన్నత విద్యావంతులేనని ఎన్‌సీఆర్‌బీ లెక్కలు చెబుతున్నాయి. వీరంతా నిత్యం ఆన్‌లైన్‌లో ఉంటూ వివిధ సైట్లలో బ్రౌజ్‌చేస్తున్న సమయంలో సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుతున్నారని తెలుస్తోంది.

**మోసపోయాక ఏం చేయాలంటే..**

- పెరుగుతున్న సాంకేతికత, సెల్‌ఫోన్ వినియోగం దృష్ట్యా తెలిసినవారు సైతం మోసపోయే అవకాశం ఉంటుంది.
- అలాంటప్పుడు కంగారుపడకుండా సైబర్‌క్రైమ్ రాష్ట్ర హెల్ప్‌లైన్ నంబర్ 1930, జాతీయ హెల్ప్‌లైన్ నంబరు 155260కు వెంటనే ఫోన్‌చేయాలి. పోలీసులు కేసు నమోదు చేస్తే వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వివరాలు అందిస్తారు. ఎలాంటి నష్టం జరిగినా మూడు, నాలుగు గంటల్లోపు ఫిర్యాదు చేస్తే కోల్పోయిన నగదు తిరిగి వచ్చే అవకాశం ఉంది.

### గోప్యత పాటించాలి



సోషల్ మీడియా వినియోగం బాగా పెరిగింది. దీంతో సమాచార గోప్యత పాటించాలి. ఈ మెయిల్, ఇతర పాస్‌వర్డులు ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచాలి. రెండంచెల సెక్యూరిటీ విధానం అవలంబిస్తే మోసాల బారినపడే ఆస్కారం తక్కువ. నేరాగాళ్లు కొత్తమోసాలకు పాల్పడుతున్నారు. డబ్బులు ఊరకనే రావనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. పోలీసుశాఖ సైతం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది.

– రెమా రాజేశ్వరి, సీపీ, రామగుండం

# కట్టడికి పకడ్బందీ చర్యలు

- ముంచుకొస్తున్న కరోనా ముప్పు
- అప్రమత్తమైన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు
- ఇప్పటికే మాక్‌డ్రిల్ పూర్తిచేసిన యంత్రాంగం
- అందుబాటులో బెడ్లు, కిట్లు, ఆక్సిజన్, ఔషధాలు
- సర్వసన్నద్ధమైన వైద్యులు, సిబ్బంది



పెద్దపల్లిరూరల్: కరోనా ముప్పు ముంచుకొస్తుండడంతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. దాదాపు మూడేళ్ల క్రితం ప్రజలను కలవరపెట్టిన కరోనా నేర్పిన గుణపాఠాలను దృష్టిలో ఉంచుకున్న అధికారులు.. ఆ మహమ్మారిని పూర్తిగా కట్టడి చేసేందుకు సర్వసన్నద్ధమయ్యారు. కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ అధికారులు నేరుగా జిల్లా అధికారులను ఈ విషయంలో అనునిత్యం అప్రమత్తం చేస్తున్నారు. వైరస్ ప్రబలితే తీసుకునే కట్టడి చర్యలపై మాక్‌డ్రిల్ కూడా నిర్వహించారు. దేశంలోని కేరళ రాష్ట్రంలో కరోనా వైరస్ విజృంభిస్తుండడంతో జిల్లా అధికార యంత్రాంగం కఠిన చర్యలకు పూనుకుంది.

- ఆస్పత్రుల్లో 460 పడకలు సిద్ధం..
- జిల్లాలో కరోనా కోరలు చాస్తే దాని బారినపడ్డ వారిని కాపాడేందుకు వీలుగా రామగుండం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ ఆస్పత్రుల్లో మొత్తం 460 పడకలు సిద్ధం చేశారు.
- రామగుండం(గోదావరిఖని)లో అత్యధికంగా 330 పడకలు అందుబాటులోకి తీసుకొచ్చిన చేసిన వైద్యాధికారులు.. పెద్దపల్లిలోని జిల్లా ఆస్పత్రిలో 50 పడకలు, మంథనిలో 50 పడకలు, సుల్తానాబాద్‌లో 30 పడకలు సిద్ధం చేశారు.

**ఆర్టీపీసీఆర్, పీపీఈ కిట్లు కూడా..**

జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో ఆర్టీపీసీఆర్, పీపీఈ కిట్లు కూడా అందుబాటులో ఉంచారు. ఆర్టీపీసీఆర్ కిట్లు సుమారు మూడువేల దాకా ఉండగా, పీపీఈ కిట్లు 600, మాస్కులు 4వేలు, శానిటైజర్లు వెయ్యి దాకా ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఆక్సిజన్ సిలిండర్లు 115 వరకు ఉన్నాయి. వీటితోపాటు అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన లాబొరేటరీని గోదావరిఖనిలో సిద్ధం చేశారు.

### జిల్లా సమాచారం

| | |
|---|---|
| అందుబాటులో బెడ్లు | 460 |
| ఆర్టీపీసీఆర్ కిట్లు | 3,000 |
| మాస్కులు | 4,000 |
| పీపీఈ కిట్లు | 600 |
| శానిటైజర్లు | 1,000 |
| ఆక్సిజన్(యూనిట్లు) | 115 |

**వైద్యసిబ్బందికి అవగాహన**

జిల్లాలోని వైద్యాధికారులు, సిబ్బందిని ఎంపిక చేసి వారందరికీ కరోనా వైరస్ బారిన పడ్డవారికి వైద్య సేవలు అందించే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం మాక్‌డ్రిల్ కూడా నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా గదులు కూడా సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

### అప్రమత్తంగా ఉన్నాం

కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రద్దీ ప్రాంతాల్లో తప్పనిసరిగా మాస్క్ ధరించడం మంచిది. గత కోవిడ్ సమయంలో అనుసరించిన పద్ధతులనే ఇప్పుడూ అవలంబించాలి. అనుకోకుండా కరోనా బారిన పడితే బాధితులకు అవసరమైన వైద్యసేవలు అందించేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నాం. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యసేవలు అందిస్తాం.

– ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో

# అవిశ్వాసం వైపే అడుగులు!

- పట్టువదలని సొంత బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- పదవి తొలగించడమే ధ్యేయమని నిర్ణయం
- సంతకాలు చేసిన 26 మంది ప్రజాప్రతినిధులు
- నగర మేయర్‌పై అసంతృప్తి సెగలు
- సమావేశం నుంచి అర్ధంతరంగా బయటకు వెళ్లిపోయిన అనిల్ కుమార్



అవిశ్వాస తీర్మాన పత్రాలపై సంతకాలు చేస్తున్న కార్పొరేటర్లు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ రాజకీయం మరింత వేడెక్కుతోంది. అవిశ్వాస తీర్మానం కోసం అసంతృప్తులు చేస్తున్న ప్రయత్నాలు ఊపందుకున్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావుపై తిరుగుబావుటా ఎగురవేసిన సొంత పార్టీ కార్పొరేటర్లు.. ఇంకో అడుగు ముందుకేసి ఆ ఇద్దరినీ పదవిలోంచి తొలగించడమే లక్ష్యంగా రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారు. బుధవారం బల్దియా కార్యాలయంలో అసంతృప్తి కార్పొరేటర్లు కలుసుకున్నారు. మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి లిఖితపూర్వక నోటీసులపై సుమారు 26 మంది సంతకాలు చేశారు.

**కార్పొరేటర్లు, మేయర్‌తో మాజీ ఎమ్మెల్యే భేటీ**

- మేయర్, డిప్యూటీ మేయర్‌పై అసంతృప్తితో ఉన్న సొంతపార్టీ కార్పొరేటర్లు, మేయర్ అనిల్‌కుమార్‌తో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తన నివాసంలో భేటీ అయ్యారు.
- అసంతృప్తికి దారితీసిన కారణాల గురించి ఒక్కొక్కరిని అడిగి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు.
- అయితే, మేయర్ పదవి నుంచి అనిల్‌కుమార్‌ను తొలగించాలని ముక్తకంఠంతో తమ స్వరం వినిపించారు.
- ఆదినుంచీ కాంగ్రెస్ నాయకులతో టచ్‌లో ఉంటున్న మేయర్, ఇటీవల ఎమ్మెల్యే నిర్వహించిన సమీక్ష సమాచారం ఇవ్వలేదని, ఇలాంటి మేయర్ భవిష్యత్‌లో బీఆర్ఎస్ ప్రతిష్ఠకు ప్రమాదకరమనే సందేశాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది.
- దీంతో జిల్లా మాజీ ఇన్‌చార్జి మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు చందర్ ఫోన్‌చేసి తాజా పరిణామాలు వివరించారు.
- రెండురోజుల్లో ఢిల్లీ నుంచి వచ్చాక అందరితో సమావేశమవుతానని, అప్పటి వరకు అవిశ్వాస ప్రయత్నాలు వద్దని కొప్పుల నచ్చజెప్పారు.
- ఆయన వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటామని కార్పొరేటర్లు వెల్లడించారు.

**అలిగిన అనిల్‌కుమార్..**

కోరుకంటి చందర్ నిర్వహించిన భేటీకి మేయర్ కూడా నేరుగా హాజరయ్యారు. మేయర్‌ను పదవి నుంచి తప్పించాలని కార్పొరేటర్లు అందరూ తమ నిర్ణయం ప్రకటించారు. కంగుతిన్న అనిల్‌కుమార్ అలిగి అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు పార్టీ ముఖ్యులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా మేయర్ ఆగలేదు. మరోవైపు.. ఈనెల 25న కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసులు అందజేయడానికి అసంతృప్తి కార్పొరేటర్లు వ్యూహాత్మకంగా సమాలోచనలు చేస్తున్నారని తెలుస్తోంది.

# ట్రేడ్‌లైసెన్స్ వసూళ్లకు స్పెషల్ డ్రైవ్



అవగాహన కల్పిస్తున్న త్రియంబకేశ్వర్‌రావు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని వ్యాపారుల నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేయడానికి బుధవారం నుంచి అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, వైకుంఠం ద్వారా ట్రేడ్‌లైసెన్స్ వసూళ్లను పెంచడానికి రెండు బృందాలను ఏర్పాటు చేశారు. స్పెషల్ డ్రైవ్‌ను డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు పర్యవేక్షించారు. వ్యాపారస్తులకు స్వయంగా డిప్యూటీ కమిషనర్ ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లింపులపై అవగాహన కల్పించారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు సకాలంలో చెల్లించి సహకరించాలని ఆయన కోరారు. గడువులోగా చెల్లించనివారికి జరిమానా విధించడంతోపాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

# జిల్లాకు చేరిన క్రిస్మస్ కానుకలు



సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోతో వచ్చిన కానుకలు

పెద్దపల్లిరూరల్: క్రిస్మస్ కానుకలు జిల్లాకు చేరుకున్నాయి. పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాలకు వెయ్యి చొప్పున క్రిస్మస్ గిఫ్టులను పేద క్రైస్తవులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మెహరాజ్ మహమ్మద్ తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి క్రిస్మస్ కానుకలు పంపిణీకి సిద్ధం చేశారు. కానుకలపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రాన్ని ముద్రించారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు.

# విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగిద్దామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ కోరారు. జిల్లా జిల్లా కేంద్రంలో బుధవారం మూడో మహాసభల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. ఉన్నత చదువులు చదివిన వారికి ఉద్యోగాలు ఇవ్వడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన విద్యావిధానాన్ని నిరసిస్తూ జనవరి 21న పార్లమెంట్ మార్చ్ చేపడుతున్నామని పేర్కొన్నారు.

# మాయమైన స్క్రాప్ ఫైల్?

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం పాత మున్సిపల్ కార్యాలయంలో రెండేళ్ల క్రితం చోటుచేసుకున్న స్క్రాప్ చోరీ తాజాగా వెలుగులోకి రావడం హాట్‌టాపిక్‌గా మారింది. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు పురోగతి కనిపించలేదనే విమర్శలు ఉన్నాయి. చోరీలో ఓ కార్పొరేటర్ భర్త హస్తం ఉందనే ఆరోపణలు దుమారం లేపాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల అండతోనే స్క్రాప్ మాయం చేశారని ప్రచారం. ఇంతకాలం మౌనం వహించిన అధికారులు.. కేసు పురోగతిపై మళ్లీ దృష్టి సారించారు. సొత్తు ఎంత రికవరీ చేశారు? నిందితులను అరెస్ట్ చేశారా? అనే సమాచారం కోసం కమిషనర్ పోలీసులకు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది.

**కనిపించని ఫైల్?**

విలువైన స్క్రాప్‌ను అధికారులు చాలాకాలంగా నిర్లక్ష్యంగా వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. ఇందులో ఇనుము, పాత ట్రాక్టర్ ట్యాంకర్, పాత రిక్షాలు, హ్యాంగ్లర్లు తదితర పనికిరాని పరికరాలు ఉన్నట్లు సమాచారం. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం పాత మున్సిపల్ కార్యాలయ భవనం గతంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా టేకు దర్వాజలు, కిటికీలు కూడా తొలగించారు. ఇందులోని పనికిరాని వస్తుసామగ్రి వివరాలు తమ వద్ద లేవని అధికారులు చెబుతున్నారు. మరోవైపు.. భవనం కూల్చివేశాక దొంగలు స్క్రాప్ చోరీచేశారు. కంగుతిన్న అధికారులు.. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిసింది. మరోవైపు.. అంచనాలతో తయారు చేసిన వేసిన ఫైల్ కూడా కనిపించడం లేదని ప్రచారం జరుగుతోంది. ఫైల్‌ను సమర్పించాలని బల్దియా అధికారులను కార్పొరేషన్ కమిషనర్ ఇప్పటికే ఆదేశించారు.



## ప్రకృతి పర‘వశం’

చుట్టూ నీలిరంగులోని వెచ్చటి నీళ్లు.. సూర్యకిరణాలు ముద్దాడుతూ మురిసి వికసిస్తున్న తామరపూలు.. వేకువ జామున చల్లగా వీస్తూ పలుకరించే పైరగాలి.. ప్రకృతి ఒడిలో నిత్యపూజలు అందుకుంటున్న ఆదిదేవుడు.. వ్యవసాయ పనుల కోసం నిత్యం పొలంబాట పట్టే అన్నదాతలకు దీవెనలు అందించే వినాయకుడు.. ఈ అద్భుత దృశ్యం పెద్దపల్లి జిల్లా కాసుపల్లి గ్రామ చెరువులోనిది. ఆ స్వామిని నమ్ముకుని ఏటా ఆశించిన దిగుబడులు సాధిస్తున్నారు రైతులు. నవరాత్రుల సందర్భంగా ఏకదంతుని గత సెప్టెంబరులో పూజలు చేసిన భక్తులు.. ఆ తర్వాత విగ్రహాలను కాసులపల్లి చెరువులో నిమజ్జనం చేశారు. అందులోని ఓ విగ్రహం సగం వరకు నీటిలో కరిగిపోయింది. కేవలం తలభాగం మాత్రమే నీటిపై ఇలా కనిపించి కర్షకులే కాదు.. భక్తులనూ పరవశింపజేస్తోంది. ‘సాక్షి’ కెమెరాకు చిక్కిందీ దృశ్యం.

– సాక్షిఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

## క్లుప్తంగా

### పెరిగిన చలితీవ్రత



స్వెట్టర్లు ధరించిన వాకర్లు

**జ్యోతినగర్(రామగుండం):** జిల్లాలో చలి వణికిస్తోంది. కొన్నిప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. చలిగాలులు వీస్తుండటంతో జనం గజగజ వణుకుతోంది. తగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి, ఆస్తమా తదితర సమస్యలతో ఆస్పత్రికి వెళ్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. చలి ప్రభావంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. బుధవారం చలితీవ్రత పెరగడంతో ప్రజలు వణికిపోయారు.

### ఆవిర్భావ ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సుధాకర్‌రావు

**రామగిరి(మంథని):** సింగరేణి అవిర్భావ వేడుకల ఏర్పాట్లను ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు బుధవారం పరిశీలించారు. స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో వేడుకల ఏర్పాలు చేపట్టారు. వివిధ గనుల స్టాల్స్ ఇక్కడ ఏర్పాటు చేస్తారు. కార్మికులు, కుటుంబసభ్యులు, ఇతర అతిథులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని జీఎం ఆదేశించారు. ఏరియా సేఫ్టీ అధికారి వెంకటరమణ, ప్రాజెక్టు అధికారి కె.రాజేందర్, సివిల్ డీజీఎం పద్మరాజు, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### జీవో 22 అమలు చేయండి

**యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం):** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీవో నంబరు 22ను గెజిట్ చేసి వెంటనే అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జోన్‌వన్ కాంట్రాక్టు కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోలేదన్నారు. వేతనాలు పెంచక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొత్త ప్రభుత్వం వారికి హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని కోరారు. నాయకులు దుర్గేశ్, దుర్గం బాబు, సతీశ్, రాజబాబు, శకరమ్మ, రాజన్న, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### హెచ్‌ఎంఎస్‌తోనే కార్మిలకు ప్రయోజనం

**రామగిరి(మంథని):** కార్మికుల సంక్షేమం హెచ్‌ఎంఎస్‌తోనే సాధ్యమని ఆ యూనియన్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2 వద్ద జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికుల సమస్యలే ఎజెండాగా హెచ్‌ఎంఎస్ ముందుకు సాగుతోందన్నారు. కోల్ ఇండియా మాదిరిగా ఇన్‌కంట్యాక్స్ వాపస్, సొంత ఇంటి పథకం అమలు, జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్ మార్పిడి, మహిళా కార్మికులకు అర్హతను బట్టి ఉద్యోగం, ప్రతీ ప్రమోషన్‌కు ఇంక్రిమెంట్లతోపాటు ఆయా అంశాలను మేనిఫెస్టోలో పొందుపర్చామని అన్నారు. సంస్థ భవిష్యత్ దృష్ట్యా కార్మికుల హక్కుల సాధన కోసం హెచ్‌ఎంఎస్‌కు మద్దతు పలకాలని కోరారు. నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్, కొమ్ము మధునయ్య, ఉమమహేశ్వర్, క్రాంతికిరణ్, మహ్మద్ ఖాన్, గోశిక అశోక్, షకీల్, సత్యనారాయణ, డేవిడ్, శ్రీనివాస్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# చలో ‘గురుకులం’

- 5వ తరగతి ప్రవేశాలు షురూ
- ఇంగ్లిష్ మీడియంలో బోధన
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- జనవరి 6 వరకు గడువు
- ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో 23 గురుకులాలు.. 1,840 సీట్లు



**కరీంనగర్:** గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ, రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఇంగ్లిష్ మీడియంలో విజయవంతంగా నడుస్తున్న గురుకులాల పాఠశాలల్లో ప్రవేశాలకు కొన్నేళ్లుగా తీవ్ర పోటీ నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని 23 గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి 1,840 సీట్లు ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో 5, జగిత్యాల 5, పెద్దపల్లి 6, రాజన్న సిరిసిల్లలో 7 ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో చింతకుంట, హుజూరాబాద్, జమ్మికుంట, మానకొండూర్, మల్లాపూర్, జగిత్యాల జిల్లాలో మేడిపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల, గొల్లపల్లి, పెద్దపల్లి జిల్లాలో మంథని, గోదావరిఖని, రామగుండం, నందిమేడారం, మల్లాపూర్, గొల్లపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాలో బద్దెనపల్లి, వేములవాడ, చిన్నబోనాల, బోయిన్‌పల్లి, ముస్తాబాద్, నర్మాల, ఇల్లంతకుంటలో గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఈనెల 18 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1 లక్షా 50 వేలు, పట్టణ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించరాదు.

**ఉమ్మడి జిల్లాలో 1,840 సీట్లు..**

ఉమ్మడి జిల్లాలోని 23 గురుకులాల్లో 5వ తరగతిలో ఒక్కొక్క పాఠశాలలో 80 సీట్ల చొప్పున 1,840 సీట్లు ఉన్నాయి. ప్రైవేటుకు దీటుగా విద్యాబోధనతో పాటు, భోజనవసతితో పాటు సకల వసతులు ఉంటాయి. ఎస్సీలకు 65 సీట్లు, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలకు 15 సీట్ల చొప్పున కేటాయించారు. ఒక్కసారి ప్రవేశం పొందితే 12వ తరగతి వరకు ఉచితంగా చదువు, హాస్టల్‌తో పాటు అన్నిరకాల వసతులు కల్పిస్తారు. బట్టలు, పుస్తకాలు, కాస్మోటిక్ చార్జీలు అందించనున్నారు.

**జనవరి 6 వరకు దరఖాస్తు గడువు**

5వ తరగతి ప్రవేశం పొందే విద్యార్థులు దరఖాస్తులను http://ttwreis.in, http:// tgcet. cgg.gov.in, http:/tgtwgurukulam.telangana.gov.in, http:/mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా 6 జనవరి 2024 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఒక ఫోన్‌నంబరుతో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవచ్చు. వేరే వారి ఫొటోలు పెట్టి దరఖాస్తు చేస్తే వారిపై సెక్షన్ 416 ఐపీసీ 1,860 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. 2023లో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్ని జిల్లాల్లో గుర్తించిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుంది.

**అదిరిపోయే మెనూ..**

- వారానికి నాలుగురోజులు కోడిగుడ్లు, ఆరు రోజులు పండ్లు
- ఒకటో, మూడో, ఐదో ఆదివారం చికెన్
- రెండో, నాల్గో ఆదివారం మటన్
- ప్రతిరోజు నెయ్యి, పాలు
- సాయంత్రం లేదా రాత్రి భోజన సమయంలో స్నాక్స్
- వారంలో కనీసం నాలుగైదు రకాల ఆకుకూరలు, ఎనిమిది రకాల కూరగాయలతో కూరలు
- ప్రతి శనివారం స్వీట్లు

### పేద విద్యార్థులకు వరం

గురుకుల పాఠశాలలు పేద విద్యార్థులకు వరం. నాణ్యమైన భోజనం అందించడంతోపాటు ఇంగ్లిష్ మీడియం బోధన కావడంతో పాఠశాలల్లో ప్రవేశాలకు పోటీ నెలకొంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, గురుకులాల రీజనల్ ఇన్‌చార్జి కో ఆర్డినేటర్

# సమస్యలు పరిష్కారమయ్యేనా?

- నేడు హైదరాబాద్‌లో చర్చలు
- కేశోరాం కాంట్రాక్ట్ కార్మికుల్లో ఆశలు



బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం

**పాలకుర్తి(రామగుండం):** బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం హైదరాబాద్‌లో కార్మిక సంఘం నాయకులతో కంపెనీ యాజమాన్యం చర్చలు నిర్వహించనుంది. కంపెనీలో ప్రాతినిథ్యం వహిస్తున్న కార్మికసంఘం నాయకులు రెండేళ్ల డిమాండ్ల పరిష్కారం కోసం యాజమాన్యానికి పలుమార్లు విన్నవించారు. అర్హులైన కాంట్రాక్ట్ కార్మికులకు కాంట్రాక్ట్ బేసిక్ కార్మికులుగా పదోన్నతి కల్పించడం, రేట్లు పెంచడం, అన్‌స్కిల్డ్ కార్మికులను సెమీ స్కిల్డ్ కార్మికులుగా, సెమీస్కిల్డ్ కార్మికులను స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి వారికి అలవెన్స్‌లు అందించడం, తదితర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కార్మికసంఘం నాయకులు కంపెనీ యాజమాన్యంతో పలు దఫాలుగా చర్చలు జరిపారు. అయితే యాజమాన్యం మాత్రం కాలయాపన చేసింది. మరోవైపు మూడునెలల క్రితమే కార్మికసంఘం పదవీకాలం కూడా పూర్తయింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కంపెనీలో ఎన్నికల నిర్వహణ విషయం వాయిదా పడింది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తి కావడంతో కాంట్రాక్ట్ కార్మికసంఘం ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపక్ష యూనియన్ నాయకులు మూడురోజుల క్రితం కంపెనీ హెచ్‌ఆర్ అధికారులతో పాటు పోలీసు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను నెరవేర్చాలని మంగళవారం ప్రస్తుత కాంట్రాక్ట్ కార్మికసంఘం నాయకులు కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో స్పందించిన అధికారులు గురువారం హైదరాబాద్‌లో కంపెనీ ఉన్నతాధికారులతో తెలుపడంతో ఆందోళన విరమించారు. ఒకవైపు కార్మికసంఘం పదవీకాలం పూర్తికావడం, మరో వైపు కేశోరాం కంపెనీని ఇటీవల అల్ట్రాటెక్ కంపెనీ కొనుగోలు చేయడం, వీటన్నింటి దృష్ట్యా కార్మిక సమస్యలు పరిష్కారమవుతాయా లేదా అనేది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# లాడ్జిలో ఒకరిపై హత్యాయత్నం

- ముగ్గురిపై కేసు

**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి పట్టణ శివారు రంగంపల్లిలోని ఓ హోటల్ లాడ్జిలో బుధవారం వేకువజామున గోదావరిఖనికి చెందిన రౌడీషీటర్ ప్రేమ్‌కుమార్‌పై హత్యాయత్నం జరిగింది. పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌తో పాటు సుల్తానాబాద్‌కు చెందిన పెర్క ప్రదీప్, ఆరేపల్లి సుహాస్‌రాజ్ లాడ్జిలోని గదిలో ఉన్నారు. మద్యం మత్తులో జరిగిన వాగ్వాదంతో ప్రేమ్‌కుమార్‌పై ప్రదీప్, సుహాస్‌రాజ్ కత్తులతో దాడికి దిగారు. ఇటుక బట్టీల లావాదేవీలకు సంబంధించిన వ్యవహారమే వివాదానికి కారణంగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న ఎస్సై మహేందర్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని ప్రేమ్‌కుమార్‌ను ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రేమ్‌కుమార్ భార్య రోజా ఫిర్యాదు మేరకు ప్రదీప్, సుహాస్‌రాజు, రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



### ఆకాశంలో అద్భుతం

**కోల్‌సిటీ:** బుధవారం నీలాకాశంలో అద్భుత దృశ్యం కనువిందు చేసింది. తెల్లని మేఘాలు సముద్రపు చేపలు, చేపపొట్టు పొలుసుల మాదిరిగా కనిపించి అబ్బురపర్చింది. వెండివాకిలి పరుచుకుందా అనే మాదిరిగా ఆకట్టుకుంది. వాతావరణంలో మార్పులతో ఇలాంటి అద్భుత దృశ్యాలు కనువిందు చేస్తాయని సైన్స్ నిపుణులు తెలిపారు.

### ఉపాధ్యాయుడి సస్పెన్షన్

**జ్యోతినగర్(రామగుండం):** నర్రాశాలపల్లి మండల పరి షత్ ప్రాథమిక పాఠశాలలోని సెకండరీ గ్రేడ్ టీచర్ కోట శ్రీ నివాస్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విధులకు హాజరుకాకుండా ప్రైవేట్‌గా వ్యక్తిని నియమించినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు విచారణ జరిపిన మండల విద్యాశాఖ అధికారి నివేదిక ఆధారంగా శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

### గీత కార్మికుడికి గాయాలు

**రామగిరి(మంథని):** మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు రంగు హన్మంతు(55) తాటి చెట్టుపై నుంచి జారిపడి గాయపడ్డాడు. వెంటనే స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు కాట రాజేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ముత్యం సతీశ్‌గౌడ్ కోరారు.

### బీసీకాలనీలో ఇల్లు దగ్ధం

**పాలకుర్తి(రామగుండం):** మండలంలోని జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధి బీసీకాలనీలో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పస్తం బాబుకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో బాబు అతడి భార్య, పిల్లలు అరుపులతో పరుగెత్తుకుంటూ బయటకు వచ్చారు. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న బసంత్‌నగర్ పోలీసులు గోదావరిఖని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్‌సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. రేకులు, తడకలతో నిర్మించిన షెడ్డు కావడంతో పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని బియ్యం, గృహోపకరణ వస్తువులు, బట్టలు కాలిబూడిదైనాయి. దీంతో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

**కమాన్‌పూర్(మంథని):** మండల కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన తొగరి రవికుమార్(30) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లక్ష్మి, పోలీసుల వివరాల ప్రకారం.. లక్ష్మి భర్త అనారోగ్యంతో పదేళ్లక్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కూతురుకు వివాహమైంది. రవికుమార్‌కు కొద్ది నెలల నుంచి ఆరోగ్యం బాగ లేకపోవడంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స చేయిస్తున్నారు. ఆరోగ్యం బాగలేదని మనోవేదన చెంది రవికుమార్ గురువారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాములు తెలిపారు.

### గాయపడిన వ్యక్తి మృతి

**జ్యోతినగర్(రామగుండం):** గోదావరిఖని లూర్థునగర్‌కు చెందిన మారం రెడ్డి ఇన్నారెడ్డి(60) మంగళవారం ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రికి వచ్చి వెళ్తుండగా ప్లాంట్ రోడ్‌పై బైక్ అదుపు తప్పి కిందపడగా తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనం ద్వారా గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు బాల దిలీప్ ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై జీవన్ తెలిపారు.

# ఏఐటీయూసీని గెలిపిస్తే కొత్తగనుల తవ్వకం

- యూనియన్ ఉపప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య



మాట్లాడుతున్న సమ్మయ్య

**గోదావరిఖని:** రాబోయే ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపిస్తే కొత్త గనులు తీసుకు వస్తామని ఆ యూనియన్ ఉపప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య హామీ ఇచ్చారు. బుధవారం వకీల్‌పల్లిగనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సొంతింటి పథకం అమలు చేస్తామని, పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ రిఫండ్ చేస్తామన్నారు. ఏఐటీయూసీ పోరాటంతోనే కార్మికులు అనేక హక్కులు అనుభవిస్తున్నారన్నారు. లాభాల బోనస్, పండుగ అడ్వాన్స్ ఇప్పించామన్నారు. సంస్థలో రాజకీయ జోక్యాన్ని నివారిస్తామని, ఆర్థిక దోపిడీని అరికడతామన్నారు. సమావేశంలో నాయకులు రాజారత్నం, రవీందర్, అన్నారావు, వెంకటేశ్వర్లు, మహేందర్, సంపత్, రాజు, విజయ్, పోశన్న, నసీముద్దీన్ పాల్గొన్నారు.

## బొగ్గు బాయి వార్తలు

# మారుపేర్ల సమస్య పరిష్కరించాలి

- ఐఎఫ్‌టీయూ నాయకుల వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**గోదావరిఖని:** సింగరేణి కార్మికుల మారుపేర్ల సమస్య పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో వారు డైరెక్టర్(పా)ను కలిశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ మాట్లాడుతూ సింగరేణిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరామన్నారు. కార్మిక వారసుల వయసు 35 – 40ఏళ్లకు పెంచాలని, అసెంబ్లీలో మాట ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అనారోగ్య కారణాల రీత్యా ఉద్యోగానికి అన్‌ఫిట్ అయితే వారి వారసులకు వయసు సరిపోవడం లేదన్నారు. గత పాలకులు ప్రతీఎన్నికల సందర్భంగా మారుపేర్ల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని పేర్కొన్నారు. రిటైర్‌మెంట్ తర్వాత రావాల్సిన బకాయిలు ఇవ్వడంలో కంపెనీ జాప్యం చేస్తోందన్నారు. దీనిపై డైరెక్టర్(పా) సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. నాయకులు సాలిగామ మల్లేశ్, ఇ.నరేశ్ పాల్గొన్నారు.

# అసలు సిసలైన సంఘమేదో కార్మికులే తేల్చుతారు

- ఏటీయూసీ నేత మిర్యాల రంగయ్య



మాట్లాడుతున్న రంగయ్య

**గోదావరిఖని:** సింగరేణిలో అసలు సిసలైన సంఘమేదో కార్మికులే తేల్చుతారని ఏఐటీయూసీ నేత మిర్యాల రంగయ్య అన్నారు. బుధవారం జీడీకే–2, ఓసీపీ–5లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కొన్ని యూనియన్‌లు ద్వంద్వ వైఖరి అవలంబిస్తూ యాజమాన్యానికి, ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ మరోవారంలో జరిగే ఎన్నికలను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. వారు కార్మికుల పక్షమా? లేక కంపెనీ పక్షమా అని ప్రశ్నించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ యూనియన్‌లను ఆహ్వానిస్తే.. కొన్ని యూనియన్‌లు రాకుండా సింగరేణి భవన్‌కు వెళ్లి డైరెక్టర్‌లతో కూర్చుని కాలక్షేపం చేశాయని విమర్శించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 118 నియోజకవర్గాల్లో తమ పార్టీ, యూనియన్ సహకరించి కాంగ్రెస్ పార్టీ విజయానికి దోహదపడ్డాయన్నారు. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో సింగరేణిలో ఏఐటీయూసీకి మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, అరెల్లి పోశం, రంగు శ్రీనివాస్, గౌతం గోవర్దన్, సంకె అశోక్, మాదన మహేష్, కన్నం లక్ష్మీనారాయణ, గండి ప్రసాద్, బోగ సతీశ్‌బాబు, నాగేందర్, ప్రభుదాస్, పర్లపెల్లి రామస్వామి, సోహేల్, ఏలేశ్వరం సత్యనారాయణ, సుధాకర్, తిరుపతి, చీకటి అంజయ్య, కారంపూడి వెంకన్న, గొడిశల నరేశ్, ఎంఏ గౌస్, శనగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ప్రారంభించాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



కండువా కప్పి ఆహ్వానిస్తున్న రాజారెడ్డి

**గోదావరిఖని:** సింగరేణిలో స్కూళ్లలో సీబీఎస్ఈ సిలబస్ ప్రారంభించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కారుణ్య నియామకాల ద్వారా యువ కార్మికుల సంఖ్య పెరుగుతోందని, ప్రస్తుతం సింగరేణిలో స్కూళ్లన్నీ మూతపడుతున్నాయన్నారు. పిల్లల చదువులకు ఇబ్బందులు ఏర్పడే పరిస్థితులు తలెత్తాయని అన్నారు. కార్మికుల్లో మార్పు మొదలైందని, పెద్దసంఖ్యలో యూనియన్‌లో చేరుతున్నారన్నారు. ఈసందర్భంగా పలువురు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశంలో నాయకులు ఎస్.భిక్షపతి, మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, తోట నరహరిరావు, ఆసరి మహేశ్, ఆరెపల్లి రాజమౌళి, ఎస్కే గౌస్, కారం సత్తయ్య, వంగల రాములు, తిప్పారపు రాజు, విజయ్‌కుమార్, బీమా, జనార్దన్, సాయికృష్ణ, సాగర్, బూరుల రాములు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో కుంభకోణాలపై విచారణ జరిపిస్తాం

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున సత్తయ్య

**గోదావరిఖని:** సింగరేణిలో జరిగిన కుంభకోణాలపై విచారణ జరిపిస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, నాయకుడు జె.రాంమోహన్ అన్నారు. బుధవారం జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మిక హక్కుల రక్షణ, సంస్థ పరిరక్షణకు బీఎంఎస్ కృషి చేస్తుందన్నారు. తాగునీరు, మెరుగైన రోడ్లు, కేంద్రీయ విద్యాలయాల ద్వారా కార్పొరేట్‌స్థాయి విద్య అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మండ రమాకాంత్, పులి రాజారెడ్డి, ఆకుల హరిణ్, సాయవేణి సతీశ్, వై.సారంగపాణి, మాదాసు రవీందర్, పెంచాల వెంకటస్వామి, బోడకుంట రాజేశం, ఎల్లావుల కోటయ్య, ముస్కుల భాస్కర్‌రెడ్డి, పల్లె శ్రీనివాస్, తాట్ల లక్ష్మయ్య, మహాత్మా లింగయ్య, పోరండ్ల వెంకటేశం, తుమ్మ గట్టయ్య, గరిక నరసింహులు, ఎడ్ల వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం

**యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం):** సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపిస్తే కార్మికుల సొంతింటి కలను నెరవేరుస్తామని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలోని ప్రెస్ భవన్‌లో మాట్లాడారు. పెర్క్స్ పై ఇన్‌కమ్ ట్యాక్స్ రిఫండ్ ఇప్పిస్తామని, కొత్త మైన్స్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చూస్తామన్నారు. కార్మికులకు అనేక రక్షణ సౌకర్యాలు ఉండేలా యాజమాన్యంతో చర్చించి అమలు చేస్తామన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేంద్ర కార్యదర్శి రాజారత్నం, ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి రవీందర్, అన్నారావు, వెంకటేశ్వర్లు, మహేందర్, రాజు, అంజి, విజయ్, రాజశేఖర్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

# హక్కుల సాధన సీఐటీయూతోనే సాధ్యం

**రామగిరి(మంథని):** కార్మికుల హక్కుల సాధన సీఐటీయూతోనే సాధ్యమని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు అన్నారు. బుధవారం ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏ గనిపై ఫిట్ కార్యదర్శి దేవర రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గెలిచిన సంఘాలు కార్మికుల సమస్యలు ఏనాడూ పట్టించుకోలేదన్నారు. కేవలం పైరవీలకే ప్రాధాన్యం ఇచ్చాయని పేర్కొన్నారు. తాము కార్మికుల పక్షాన పోరాటాలు చేశామని, నిస్వార్థంగా వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని, గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించాలని కోరారు. వెంకటేశ్వర్లు, కుమార్, పాషా, ప్రభాకర్, దుర్గాప్రసాద్, తిరుపతి, రాజేశం, అరవింద్, వెంకటేశం పాల్గొన్నారు.

# కార్మిక కాలనీల్లో అధికారుల పర్యటన



క్వార్టర్ పరిశీలిస్తున్న అధికారులు

**యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం):** సింగరేణి అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలోని ఉత్తమ పర్యావరణహిత గృహాలను బుధవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సింగరేణి ఉద్యోగులు నివసించే ఇళ్లు, పెంచుకునే మొక్కలు, ఇంటి పరిసరాలు, అలంకరణ విధానాలు చూశారు.

**ఉత్తమ నివాసాల ఎంపిక**

**రామగిరి(మంథని):** సెంటనరీకాలనీలో పర్యావరణ క్వార్టర్ల ఎంపిక కోసం ఎస్‌వోటూ జీఎం, కమిటీ కన్వీనర్ జి.రఘుపతి, అధికారులు కాలనీల్లో పర్యటించారు. సుమారు 15 మంది కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకోగా వారు నివాసం ఉంటున్న క్వార్టర్లను సందర్శించారు. పూలమొక్కలు, ఇంటి ఆవరణ, శుభ్రత, పొదుపుగా విద్యుత్, నీటి వినియోగం తదితర అంశాలు పరిశీలించారు. పర్యావరణ అధికారి కిషన్, డీవైపీఎంలు కె.మారుతి, వి.సునీల్ ప్రసాద్ పాల్గొన్నారు.

### సమ్మె వాయిదా

**రామగిరి(మంథని):** కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారించాలని ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట ఈనెల 22న చేపట్టిన సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ నాయకుడు ఆకుల వెంకన్న తెలిపారు. సీఎంపీఎఫ్ చిట్టీలు తప్పులతడకగా ఉన్నాయని, వాటిని సవరించాలని జీఎం కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టామన్నారు. స్పందించిన యాజమాన్యం వాటిని సరిచేస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.